


మా కలం.. మీ వజ్రాయుధం..

APTEL 2022 / 16169

# టుడే పల్లె సాక్షి

తెలుగు దిన పత్రిక

pallesakshi2022@gmail.com

youtub : pallesakshi news








PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA

| కర్నూలు : ఎడిటర్ : వి.లింగమూర్తి | సంపుటి : 5 సంచిక : 103 | పేజీలు : 8 | వెల రూ.4/- | email : pallesakshi2022@gmail.com | గురువారం 10-09-2026 |
|---|---|---|---|---|---|


# ప్రతీకారం కాదు..

# ప్రజల బాగోగులే లక్ష్యం..!!

- మూడేళ్ల క్రితం ఇదే రోజున నన్ను అక్రమంగా అరెస్టు చేశారు
- నేను పగ తీర్చుకోవాలంటే నిమిషం చాలు
- మాచవరంలో 'మీ భూమి-మీ హక్కు' సభలో సీఎం చంద్రబాబు

**అమలాపురం :** ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. తనవి కక్షపూరిత రాజకీయాలు కాదని.. ప్రజల కోసమే



నిత్యం ఆలోచిస్తానని పునరుద్ఘాటించారు. గొడ్డలి పార్టీ పాలకులు మూడేళ్ల క్రితం ఇదే రోజు (సెప్టెంబర్ 9)న నంద్యాలలో అర్ధరాత్రి అన్యాయంగా తనను అరెస్టు చేశారని గుర్తు చేశారు. తాను జైల్లో ఉన్నపుడు తెలుగు జాతి మొత్తం రోడ్లపైకి వచ్చి సంఘీభావం తెలిపిందన్నారు. తనను పరామర్శించేందుకు వస్తున్న పవన్ కల్యాణ్‌నూ అడ్డుకున్నారని, ఆయన ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా వచ్చి మద్దతిచ్చారని గుర్తుచేసుకున్నారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక జగన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలంటే ఒక్క నిమిషం చాలన్నారు. తాను చేసే ఏ పని అయినా తెలుగు జాతికి న్యాయం జరగాలనే లక్ష్యం తప్ప ప్రతీకారం కోసం చేయనని ఆయన పునరుద్ఘాటించారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరంలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి- మీ హక్కు' గ్రామసభలో చంద్రబాబు పాల్గొని లబ్ధిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ '48 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. చాలామంది నాపై ఆరోపణలు చేశారు. కోర్టులకు వెళ్లారు. ఒక్కటీ రుజువు చేయలేకపోయారు. గత పాలకులు పెట్టిన కేసులు కోర్టులు కొట్టేశాయి. ఈడీ లాంటి సంస్థ కూడా ఇందులో ఏమీ లేదని తేల్చింది' అని చెప్పారు. సీఎం ప్రసంగంలో ముఖ్యాంశాలివీ..

**వైకాపా పాలనలో అన్నీ నష్టాలే..** విభజనతో కంటే 2019-24 పాలన నష్టాలే రాష్ట్రానికి ముప్పు తెచ్చిపెట్టాయి. మెగాడీఎస్సీలో ఉద్యోగాలిచ్చిన ఏడాది తర్వాత ఉద్యోగుల జీవితాల్లో ఆ పార్టీ నేతలు చిచ్చుపెట్టాలని చూస్తున్నారు. అసెంబ్లీలో చర్చించడానికి రమ్మంటే రారు., బయటకు వచ్చి రప్పా రప్పా అంటూ రౌడీయిజం చేస్తున్నారు. 2024లో మీరిచ్చిన తీర్పే దిల్లీలో సంజీవనిగా పనిచేసింది. రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నాం. నీరు జీవం అయితే భూమి జీవితం.. ఈ రెండింటికీ అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఎల్‌నినో సమయంలో కూడా గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలు సముద్రంలో కలిసిపోయాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలనే అనకాపల్లికి పోలవరం ఎడమకాలువ ద్వారా నీటిని అందించాం. మిమ్మల్ని కలవడానికే నెలలో నాలుగు కార్యక్రమాలతో వస్తున్నా.

**రైతులకు గౌరవం.. ఆస్తికి భద్రత...** 'మీ భూమి- మీ హక్కు' కార్యక్రమం.. రైతుల గౌరవం, వారి ఆస్తికి భద్రత కల్పిస్తోంది. గత ప్రభుత్వంలో మాట విననివారి సరిహద్దులు మార్చేశారు. 22ఏలో చేర్చేసేవారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులకు నిద్ర లేకుండా చేశారు. మేం వచ్చిన వెంటనే ఈ చట్టం రద్దు చేశాం. ఇప్పటి వరకు రాజముద్రతో 36 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలిచ్చాం. మార్చి నాటికి మిగతా 56 లక్షల మందికి అందిస్తాం. 16 లక్షల ఎకరాలను 22ఏ నుంచి తప్పించాం. రాష్ట్రంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 224 భూసమస్యలతో పాటు కోనసీమ జిల్లాలో బ్రిటీష్ కాలం నాటి గ్రౌండ్ రెంట్ భూముల సమస్యను పరిష్కరించాం. వచ్చే

..2వ పేజీలో

అరుగుపై కూర్చుని... ఆప్యాయంగా మాట్లాడిన సీఎం... మాచవరంలోని జయంతినగర్ కాలనీని సీఎం సందర్శించారు. ఇక్కడ 22-ఎలో ఉన్న స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి యజమానులకు శాశ్వతహక్కు కల్పించేలా పట్టాలు పంపిణీ చేశారు. ఒక ఇంటి అరుగుపై లబ్ధిదారులతో కూర్చుని వారి కష్టసుఖాలను అడిగితెలుసుకున్నారు. ఏళ్లపాటు కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పుడు సీఎం తమ ఇంటికే వచ్చి పట్టాలిచ్చారని వారు ఆనందం వ్యక్తం చేశారు.





గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం అందిస్తున్న జోగి రమేష్ కోడలు మేఘన, ఆమె తండ్రి అనంతకృష్ణగౌడ్

## జోగి రమేష్ కుటుంబం నుంచి

# ప్రాణహాని ఉంది

## కోడలు మేఘన

**నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి**

**గవర్నర్‌కు జోగి రమేష్ కోడలు మేఘన వినతిపత్రం**

**అమరావతి:** 'మా అత్తమామలు జోగి రమేష్, శకుంతల, నా భర్త రాజీవ్, ఇతర కుటుంబసభ్యుల నుంచి నాకు, నా తల్లిదండ్రులకు ప్రాణహాని ఉంది. మాకు రక్షణ కల్పించండి. నన్ను ప్రత్యక్షంగా, పరోక్షంగా వేధించినవారిపై వెంటనే చర్యలు తీసుకోండి' అని వైకాపా మాజీమంత్రి జోగి రమేష్ కోడలు మేఘన.. గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరారు. తన తండ్రి అనంతకృష్ణగౌడ్‌తో కలిసి బుధవారం గవర్నర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం అందించారు. 'నా తల్లిదండ్రులు నా పెళ్లికి రూ.5 కోట్లు ఖర్చుచేశారు. తర్వాత కొన్నాళ్లకే అత్తమామలు రూ.5కోట్ల అదనపు కట్నం, ఖరీదైన కార్లు, వజ్రాల నక్లెస్, వజ్రపు ఉంగరం తీసుకురావాలని వేధింపులు మొదలుపెట్టారు. గోవాకు వెళ్లినప్పుడు నాకు ఈత రాదని తెలిసినా నా భర్త పడవ పైనుంచి నీటిలోకి నెట్టేయడానికి ప్రయత్నించారు' అని ఫిర్యాదులో తెలిపారు. దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు. కేసును తెలంగాణకు మార్పించుకోవాలని మేఘనకు సూచించారు.

# కుట్రదారులను.. పాత్రధారులను వదలం...!!

- ఫాంహౌస్ కుట్ర నుంచి... శుద్ధీకరణ ఘటన వరకు సమగ్ర విచారణ
- కేసీఆర్.. తన సభ్యులను ఉన్మాద చర్యలకు ఉసిగొల్పారు
- వారి చేష్టలు, దాడులు, మాటలు.. తీవ్రవాదులు, ఉగ్రవాదుల చర్యల కన్నా హేయం
- సమాజాన్ని విడగొట్టి జాతి వైరం సృష్టించాలని పన్నాగం.. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

2లో



**హైదరాబాద్:** ఫాంహౌస్ కుట్ర నుంచి శుద్ధీకరణ వరకు అన్ని అంశాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిందని... ఎవరినీ వదలమని విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దళితులను, స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, మహిళా పోలీసులపై దాడులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నియంత్రణ చట్టం కింద ఐపీఎస్ అధికారి నేతృత్వంలో విచారణ చేయనున్నట్లు వెల్లడించారు. విచారణ అధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియమించనున్నట్లు బుధవారం శాసనసభలో ప్రకటించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఘటనలు, ప్రభుత్వం దృష్టికి వచ్చిన అంశాలు, అందిన ఫిర్యాదులన్నీ



## తిరుమలలో శ్రీవారి భక్తులకు

# రూ.2 లక్షల బీమా

**సహజ మరణాలకు వర్తింపు ...తితిదే చరిత్రాత్మక నిర్ణయం**

**దేశంలోనే తొలిసారిగా అమలు**

**ఈ నెల 16న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం**

**ఇప్పటికే అమల్లో ఉన్న ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు**

**తిరుపతి:** తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంక్షేమానికి తితిదే చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ప్రమాదాలకు మాత్రమే పరిమితమైన బీమా సౌకర్యాన్ని విస్తరించి, తొలిసారిగా సహజ మరణాలకు కూడా వర్తించేలా చర్యలు చేపట్టింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తిరుమలలో సహజ మరణానికి రూ.2 లక్షల బీమా ప్రయోజనం అందించే పథకానికి తితిదే పాలకమండలి ఆమోదముద్ర వేసింది. భక్తులు అలిపిరి టోల్‌ప్లాజా నుంచి తిరుమల కొండకు చేరుకుని, స్వామివారిని దర్శించుకుని తిరిగి అలిపిరి చేరే వరకు బీమా రక్షణ ఉంటుంది. ఈ 'గ్రూప్ ఇన్సూరెన్స్ పథకం' కోసం భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ)తో తితిదే ఒప్పందం కుదుర్చుకుంది. లాభాపేక్ష, సర్వీస్ ఛార్జీలు

..2వ పేజీలో

# 'నిజం గెలిచింది'

# విజయవంతం..!!

**రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తులు వెలిగించిన తెదేపా శ్రేణులు**

**'ఎక్స్'లో టాప్-1గా ట్రెండ్ అయిన హ్యాష్ ట్యాగ్**

**అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 'నిజం గెలిచింది'



ఉండవల్లి నివాసంలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న మంత్రి లోకేశ్

కార్యక్రమాలను తెదేపా శ్రేణులు విజయవంతం చేశాయి. మూడేళ్ల క్రితం సెప్టెంబరు 9న చంద్రబాబుపై నాటి జగన్ ప్రభుత్వం అక్రమ కేసు బనాయించి, జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఆ చీకటి రోజుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా.. తెదేపా అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో నిర్వహించిన కార్యక్రమాలకు మంచి స్పందన వచ్చింది. మంగళగిరిలోని తెదేపా కార్యాలయం మొదలు.. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ఎక్కడికక్కడ కొవ్వొత్తులు వెలిగించి, 'నిజం గెలిచింది' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. చంద్రబాబును జైల్లో నిర్బంధించిన 53 రోజులకు గుర్తుగా 53 కొవ్వొత్తులు వెలిగించారు. ఆయా కార్యక్రమాల్లో 21 మంది మంత్రులు, 113 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎంపీలు, 23 మంది లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు, 41 మంది



నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, 110 మంది కార్పొరేషన్ల ఛైర్మన్లు, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'నిజం గెలిచింది' హ్యాష్ ట్యాగ్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో కొంతసేపు జాతీయ స్థాయిలో టాప్-1లో ట్రెండ్ అయింది. వైకాపా ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా.. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకొచ్చారని నెటిజన్లు వేల పోస్టులు పెట్టారు. ఉండవల్లి నివాసంలో తెదేపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ 53 కొవ్వొత్తులు వెలిగించారు. ప్రజాబలమే చంద్రబాబుకు, తెదేపాకు శ్రీరామరక్షని ఆయన పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో 'నిజం గెలిచింది' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, నేతలు కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కాకినాడలో ఎంపీ సానా సతీష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఏపీఎన్ఆర్‌టీ సమన్వయకర్తల ఆధ్వర్యంలో 'నిజం గెలిచింది' కార్యక్రమం జరిగింది.

**తణుకులో వినూత్న ప్రదర్శన...** పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నేతృత్వంలో తెదేపా శ్రేణులు 53 ఆకారంలో ఒదిగి కొవొత్తులతో వినూత్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ.. '40 ఏళ్ల రాజకీయ చరిత్రలో చంద్రబాబుపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. జగన్ దుర్మార్గపు ఆలోచనతో జైల్లో పెట్టించారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వచ్చారు' అని పేర్కొన్నారు.

# ప్రతీకారం కాదు.. ప్రజల బాగోగులే లక్ష్యం



**(మొదటిపేజి తరువాయి)** మార్చి నాటికి భూములకు సంబంధించి జీరో ఎర్రర్ ఉండేలా చేస్తాం. జెన్‌జీ ఆకాంక్షలకు అనుణంగా ప్రణాళికలుండాలి: కలెక్టర్ గారూ.. మీరు కాలేజీలకు వెళ్లండి. అక్కడ జెన్‌జీతో మాట్లాడి ఆకాంక్షలు తెలుసుకోండి. వాటికి అనుగుణంగా మన ప్రణాళికలు ఉండాలి. ఆర్టీసీలో అన్నీ ఏసీ బస్సులే.. వాటిలోనూ మహిళలకు ఉచితమే: ఆర్టీసీలో ఇకపై అన్నీ ఏసీ బస్సులే ప్రవేశపెడతామని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకూ వాటిలో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని సీఎం ప్రకటించగానే మహిళలు హర్షధ్వానాలు చేశారు.

**ఇకపై 'ట్రిపుల్ పీ' విధానంతో పనిచేయాలి: చంద్రబాబు**
'పీపీపీ (ప్రైవేటు, పబ్లిక్, పార్టనర్‌షిప్) విధానం అని నేను అంటుంటే.. మీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేశ్ పర్సనల్, పార్టీ, ప్రభుత్వం (పీపీపీ) ఇలా ట్రిపుల్ పీ అనే సరికొత్త విధానాన్ని తెరపైకి తీసుకువచ్చారు' అని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్తులో ఈ కొత్త విధానాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కుటుంబానికి సమయం కేటాయిస్తూనే.. పార్టీ కోసం కృషిచేస్తూ, ప్రభుత్వం చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యతను శ్రేణులు తీసుకోవాలన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జయంతినగర్ సమీపంలో బుధవారం నిర్వహించిన పి.గన్నవరం నియోజకవర్గ తెదేపా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకాశమే హద్దుగా ఎదిగిన తెదేపాలో 1.65 కోట్ల కుటుంబాలు ఉండడం గర్వకారణమన్నారు.

# కుట్రదారులను.. పాత్రధారులను వదలం...!!

**(మొదటిపేజి తరువాయి)** క్రోడీకరించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ప్రభుత్వం మీకు అండగా ఉంది. రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలూ దన్నుగా ఉన్నారు. అధైర్య పడకండి' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పీకర్‌కు ధైర్యం చెప్పారు. మల్లికార్జున ఖర్గే, గడ్డం ప్రసాద్‌కుమార్‌లకు జరిగిన అవమానాలను వ్యక్తులకు జరిగినవిగా భావించడం లేదని.. కొందరి మనసుల్లో పేరుకున్న మనువాదం, ఆధిపత్యపు ఆలోచనల భావజాలమేనని తెలిపారు.

**కేసీఆర్ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలి...**
"ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పిలిచి సుదీర్ఘ చర్చలతో కుట్రకు ప్రణాళిక రచించారు. సభ్యులను దాడులకు ఉసిగొల్పారు. వారి చేష్టలు, దాడులు, మాటలు.. తీవ్రవాదులు, ఉగ్రవాదుల చర్యల కన్నా హేయం. పార్లమెంటులో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులకు, ఏకే-47తో ముంబయిలో సామాన్యులను కాల్చిచంపిన కసబ్‌కు, పుల్వామాలో తీవ్రవాదుల దాడులకు... స్పీకర్‌ను అవమానిస్తూ భారాస వారు వాడిన భాషకు తేడా లేదు. కేసీఆర్ దుర్మార్గమైన ఆలోచనలతో జాతి, కుల వివక్ష అంతరాలను తిరిగి సమాజంలోకి తీసుకురావాలని చూస్తున్నారు. సమాజాన్ని రెచ్చగొట్టి దొరలు, దళితులుగా విడగొట్టి, రెండు జాతుల మధ్య వైరం సృష్టించాలని అనుకుంటున్నారు. కేసీఆర్ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేయాలి. అప్పుడే ఆ వివక్ష ఎలా ఉంటుందో తెలుస్తుంది. శుద్ధి చేయాల్సి వస్తే.. ఆయనలోని అంటరానితన ఆలోచనల్ని చేయాలి. కేసీఆర్ కుటుంబ సభ్యుల మనసుల్లో అహంకారపూరిత అంటరానితన ఆలోచనల్ని శుద్ధి చేయాలి. దొర అహంకారాన్ని శుద్ధి చేసే బాధ్యతను తెలంగాణ సమాజం తీసుకుంటుంది. ప్రజా ప్రభుత్వం అంటరానితనం, వివక్ష, శుద్ధీకరణలను చూస్తూ ఊరుకోదు.

**స్పీకర్ తల్లిని అవమానించారు ...** విద్య, ధరణిలో అక్రమాలు, 22-ఏపై జరుగుతున్న రాద్ధాంతం, ప్రతిపక్షాలు లేవనెత్తిన చాలా విషయాలు, ఇతర ప్రజాసమస్యలపై సభలో చర్చించాలని మేం భావించాం. ఈ సమావేశాలు జరిగితే చర్చలో.. 2014 నుంచి 2023 నవంబరు వరకు కేసీఆర్, ఆయన కుటుంబ దురాగతాలు, చేసిన అప్పులు చర్చకు వస్తాయని.. ఈ సమావేశాలు శాశ్వత రాజకీయ సమాధి చేస్తాయని భారాస వారు భావించారు. అందుకే చర్చ జరగకూడదని కుట్ర చేశారు. కేసీఆర్.. వారి సభ్యులను ఉసిగొల్పి, ఉన్మాదులుగా మార్చడంతో.. వారు విచక్షణ కోల్పోయి ఎలా ప్రవర్తిస్తున్నారో అందరం చూస్తున్నాం. కొందరు ముష్కరులు ఉన్మాద వైఖరితో శాసనసభకు వచ్చి.. సభ ముందు ఉద్యోగంలో బాధ్యతలను నిర్వహిస్తున్న అధికారులపై దాడులు చేయడమే కాకుండా స్పీకర్ కుర్చీని, శాసనసభాపతి తల్లిని అవమానించారు.

**రాష్ట్రంలో అత్యంత అవమానకరమైన ఘటన...** పూర్వ హైదరాబాద్‌లో భాగమైన కల్యాణ కర్ణాటకలో... రజాకార్ల దాడిలో తల్లిని కోల్పోయి తండ్రి ఆలనలో పెరిగిన దళిత బిడ్డ మల్లికార్జునఖర్గే. తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు లోక్‌సభ, రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా.. దాదాపు 60 ఏళ్లు ప్రజా జీవితానికి అంకితమైన వ్యక్తి ఆయన. ప్రజాసమస్యలపై 2026 ఆగస్టు 8న ఉత్తరాఖండ్‌లోని హల్ద్‌వానీ రాంలీలా మైదానంలో జరిగిన నిరసన బహిరంగ సభలో పాల్గొన్నారు. రెండు రోజుల తరువాత భాజపా అనుబంధ సంస్థ శ్రీరాంసేన శుద్ధీకరణ చేపట్టింది. ఆ సంఘటనను శాసనసభ, తెలంగాణ సమాజం సంపూర్ణంగా ఖండిస్తోంది. ఈ చర్యలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికీ డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రపతికి ఫిర్యాదు చేశాం. అదే సమయంలో రాష్ట్రంలో అత్యంత అవమానకరమైన, క్రూర సంఘటన జరిగింది.

**దళిత ప్రతినిధులను పిలిచి మాట్లాడని కేసీఆర్...** మనం దేశాన్ని మాతగా భావిస్తాం. కానీ ఒక తల్లిని అవమానించేలా భారాస సభ్యులు విచక్షణ కోల్పోయారు. నిరసన తెలిపేందుకు ఎన్నో మార్గాలున్నా.. ఉన్మాదంతో ముందుకు వెళ్తున్నారు. వారి వైఖరిని భాజపా, ఎంఐఎం, సీపీఐ ముక్తకంఠంతో ఖండించాయి. కేసీఆర్ సభాపతికి క్షమాపణలు చెప్పి, సభలో చర్చించేందుకు అవకాశం కల్పిస్తారని అందరూ అనుకున్నారు. 24 గంటలైనా స్పందించకపోవడంతో దళిత వర్గాలు ఆవేదనకు గురయ్యాయి. కేసీఆర్ ఆదేశాలు ఇచ్చినందునే ఇలా జరిగిందని భావించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఫాంహౌస్ వద్ద దండోరా వేసి, డప్పు కొట్టాలని నిర్ణయించాయి. వారు డప్పు ద్వారా మనసులోని భావాన్ని వ్యక్తం చేశారు. వెయ్యి ఎకరాల ఫాంహౌస్‌కు 2.కి.మీ. దూరంగా నియంత్రణ పరిధి దాటి వెళ్లలేదు. భారాస వారిలా అసభ్య పదజాలంతో దూషించలేదు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్.. దళిత ప్రతినిధులను పిలిచి మాట్లాడలేదు. పైగా దళితులు అడుగుపెట్టిన ఫాంహౌస్ చుట్టూ పసుపు నీళ్లతో శుద్ధి చేశామంటూ ఆ పార్టీ ప్రతినిధులు తెలిపారు.

**ఈ సెక్షన్ల కింద కేసులు...** ఫాంహౌస్ కుట్ర నుంచి శుద్ధీకరణ వరకు అట్రాసిటీ ప్రివెన్షన్ చట్టం కింద చర్యలుంటాయి. దళితులను ఉద్దేశపూర్వకంగా బహిరంగంగా అవమానించడం (సెక్షన్ 31ఆర్), విద్వేషపూరిత వివక్ష (31యూ), శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సెక్షన్ 35(2), ప్రజల్లో విద్వేషం, అల్లర్లను రేకెత్తించడం సెక్షన్ 352(2)(35) కింద కుట్ర పన్నిన, అమలు చేసిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. అనుకోని సంఘటన అయితే క్షమాపణతో సరిదిద్దవచ్చు. దొరలు, దళితులు అనే బేధభావాలకు ఆస్కారమిచ్చే చర్యలు మంచివి కావు. ఫాంహౌస్‌లో కుట్ర నుంచి ఇప్పటివరకు జరిగిన ఘటనలన్నీ క్రోడీకరించి, క్రిమినల్ కేసులు పెట్టి విచారణ చేపట్టేందుకు శాసనసభ ఆమోదించాలి.

**దేశానికి కాంగ్రెస్ ఏం చేసిందో తెలియాలంటే...** దేశానికి కాంగ్రెస్ ఏమి చేసిందనే వారంతా మనతో సమానంగా స్వాతంత్ర్యం తెచ్చుకున్న పాకిస్థాన్‌ను చూస్తే తెలుస్తుంది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, కాంగ్రెస్ పార్టీ త్యాగం, ఆలోచన విధానాలతో భారత్.. ప్రపంచంలో ప్రధాన దేశాల సరసన నిలుస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల్లో రిజర్వేషన్లు లభించాయి. మరి పాకిస్థాన్ ఎక్కడుందో గమనించండి" అని అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## టెన్త్ పాసైతే చాలు..
# తపాలా శాఖలో 23,757 ఉద్యోగాలు!

పదో తరగతి అర్హతతో తపాలా శాఖలో 23,757 గ్రామీణ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో 917, తెలంగాణలో 419 పోస్టులు ఉన్నాయి. అర్హత, జీతం, ఫీజు, దరఖాస్తు విధానం వివరాలు తెలుసుకోండి.

పదో తరగతి పాసైన నిరుద్యోగులకు తపాలా శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. గ్రామీణ డాక్ సేవక్ (+ఙా) పోస్టుల భర్తీకి భారీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో మొత్తం 23,757 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ నియామకాల్లో ఎంపికైన అభ్యర్థులు బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (బీపీఎం), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ (ఏబీపీఎం), డాక్ సేవక్ హోదాల్లో పనిచేయాల్సి ఉంటుంది.




ఈ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణత ప్రధాన అర్హతగా ఉంది. పోస్టును బట్టి ప్రారంభంలో రూ.10,000 నుంచి రూ.12,000 వరకు వేతనం అందుకునే అవకాశం ఉంది. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 21, 2026 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

# తిరుమలలో శ్రీవారి భక్తులకు రూ.2 లక్షల బీమా

ఆశించకుండానే ఎల్ఐసీ దీన్ని వర్తింపజేయనుంది. పథకం నిర్వహణకు తితిదే రూ.2.12 కోట్లను 'రివాల్వింగ్ ఫండ్'గా కేటాయించింది. క్లెయిమ్‌లు తక్కువగా ఉంటే, మిగిలిన నిధులను మరుసటి నెలకు క్యారీ ఫార్వర్డ్ చేస్తారు. అవసరమైతే అదనపు నిధులు సమకూర్చుతారు. ఈ నెల 16న సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరాలు వెల్లడించారు.



**టికెట్ ఉన్నా.. లేకున్నా.. అందరికీ...** దర్శనం టికెట్లు ముందుగానే బుక్ చేసుకున్న వారితో పాటు నేరుగా వచ్చే భక్తులందరికీ ఈ బీమా వర్తిస్తుంది. దర్శన టికెట్లు ఉన్నవారి వివరాలు నేరుగా ఎల్ఐసీ డేటాబేస్‌లో నమోదవుతాయి. టికెట్ లేనివారు క్యూలైన్లలోకి ప్రవేశించగానే తిరుమలలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సాంకేతికత ఆధారంగా వారిని గుర్తించి బీమా పరిధిలోకి తీసుకొస్తారు. భక్తులతోపాటు తిరుమలలో నిస్వార్థంగా సేవలందించే 'శ్రీవారి సేవకుల'కూ ఈ సదుపాయం వర్తిస్తుంది.

**వీరికి మినహాయింపు:** తితిదే ఉద్యోగులు, స్థానికులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, రవాణాదారులకు వర్తించదు. ఆత్మహత్యలను బీమా పరిధి నుంచి మినహాయించారు. కవరేజ్ ప్రారంభమైన మొదటి రోజును 'లీన్ పీరియడ్'గా పరిగణిస్తారు. ఈ ఒక్కరోజులో ప్రమాద మరణానికి మాత్రమే బీమా వర్తిస్తుంది. తర్వాత సహజ మరణాలకు సైతం పూర్తిస్థాయిలో పరిహారం అందుతుంది.

**నేరుగా ఖాతాల్లోకి:** క్లెయిమ్ ప్రక్రియను తితిదే అత్యంత సులభతరం చేసింది. కొండపై ఏ భక్తుడైనా ప్రాణాలు కోల్పోతే తిరుమలలోని అశ్విని ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వైద్య కమిటీ ఆ మరణాన్ని ధ్రువీకరిస్తుంది. అనంతరం మృతుడి ఆధార్, ఇతర వివరాలతో తితిదే అధికారులే ఎల్ఐసీ ప్రత్యేక పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా క్లెయిమ్ అప్‌లోడ్ చేస్తారు. ఎల్ఐసీ ఆమోదం లభించగానే ఆ సొమ్ము నేరుగా బాధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. మరోవైపు ప్రమాదవశాత్తు మరణించిన భక్తులు, ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న రూ.3 లక్షల బీమాను రూ.10 లక్షలకు పెంచారు.

**బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం...** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తితిదే ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక అన్నమయ్య భవనంలో జరిగిన పాలకమండలి సమావేశంలో ఛైర్మన్ అధ్యక్షతన సభ్యులు హాజరై పలు తీర్మానాలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈవో ఎం.రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి వివరాలు వెల్లడించారు. 'బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నాం. అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 15వ తేదీ సాయంత్రం మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తాం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అనంతరం రాత్రి 9 గంటలకు పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. రిలయన్స్ సంస్థ తితిదేకు విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులను 16వ తేదీన సీఎం ప్రారంభిస్తారు. అదే కార్యక్రమంలో 2027 సంవత్సరానికి సంబంధించిన తితిదే క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారు' అని వివరించారు. అంతకుముందు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బుక్‌లెట్‌ను తితిదే ఛైర్మన్, ఈవో, బోర్డు సభ్యులు ఆవిష్కరించారు.

# సంపాదకీయం

### రైల్వే ప్రయాణికులకు బిగ్ రిలీఫ్..
## హైదరాబాద్-వరంగల్ రూట్‌లో రద్దీకి
# శాశ్వత చెక్..

**హైదరాబాద్--వరంగల్ మార్గంలో ప్రయాణించే వేలాది మంది నిత్య ప్రయాణికులకు కేంద్రం అదిరిపోయే గుడ్ న్యూస్ తెలిపింది. తెలంగాణకు ప్రత్యేకంగా రూ.2,419 కోట్లతో 4వ లైన్ కేటాయించడంతో పాటు దక్షిణ భారతదేశంలో రైల్వే వ్యవస్థను సరికొత్త స్థాయికి తీసుకెళ్లే మెగా ప్రాజెక్టుల వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం..**



భారతీయ రైల్వేలను ఆధునీకరించి, ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేబినెట్ కమిటీ దేశవ్యాప్తంగా 8 భారీ మల్టీట్రాకింగ్ లైన్లకు ఆమోదం తెలిపింది. దాదాపు రూ.20,804 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులన్నింటినీ 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తి చేయాలనేది రైల్వేశాఖ ప్రణాళిక. ఇందులో సింహభాగం ప్రాజెక్టులు దక్షిణాదికే దక్కడం విశేషం.

**తెలంగాణ రవాణా రంగానికి కొత్త దన్ను- ఘట్‌కేసర్--కాజీపేట 4వ లైన్**
హైదరాబాద్--వరంగల్ కారిడార్‌లో ఏళ్ల తరబడి నెలకొన్న రద్దీ సమస్యకు పరిష్కారంగా ఘట్‌కేసర్ నుండి కాజీపేట వరకు 110 కిలోమీటర్ల మేర 4వ ట్రాక్ నిర్మాణాన్ని కేంద్రం ఖరారు చేసింది. దీనికోసం ప్రత్యేకంగా రూ.2,419 కోట్లను కేటాయించింది. ప్రధాన నగరాల మధ్య నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు ఈ ప్రాజెక్ట్ ఒక తీపి కబురు. సింగిల్, డబుల్ ట్రాక్ వల్ల రైళ్లు నిలిచిపోయే పరిస్థితి తప్పుతుంది. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట, భువనగిరి వంటి ప్రాంతాలకు చేరడం సులువవుతుంది. ఈ అదనపు లైన్ ద్వారా ఏటా దాదాపు 9.83 మిలియన్ టన్నుల సరకు రవాణా అదనంగా సాధ్యమవుతుంది. ఇందులో 7.06 మిలియన్ టన్నుల బొగ్గు, 0.73 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం, 0.65 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, 0.13 మిలియన్ టన్నుల సిమెంట్ రవాణాకు వెసులుబాటు కలుగుతుంది.

**మోదీ నాయకత్వంలో తెలంగాణ రైల్వేలకు స్వర్ణయుగం: కిషన్ రెడ్డి**
సికింద్రాబాద్-కాజీపేట ప్రాజెక్టుకు ఆమోదం లభించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రం నుంచి రైల్వే బడ్జెట్ కేటాయింపులు ఏకంగా 21 రెట్లు పెరిగాయని చెప్పారు. గత 12 ఏళ్ల కాలంలో తెలంగాణ రైల్వే అభివృద్ధి కోసం రూ.36,286 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మరో రూ.50 వేల కోట్ల విలువైన పనులకు ఫైనల్ లొకేషన్ సర్వే కొనసాగుతోందని స్పష్టం చేశారు.

**రూ.3 వేల కోట్లతో 42 అమృత్ భారత్ స్టేషన్లు..,.** కేవలం ట్రాక్‌ల విస్తరణకే పరిమితం కాకుండా ప్రయాణికులకు ప్రపంచస్థాయి వసతులు కల్పించేందుకు రూ.3,000 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునీకరిస్తున్నామని కిషన్ రెడ్డి తెలిపారు. వీటిలో ఇప్పటికే 6 స్టేషన్లను ప్రధాని మోదీ ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌తో సహా అనేక ప్రాజెక్టులతో రాష్ట్ర రైల్వే ముఖచిత్రమే పూర్తిగా మారిపోయిందని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

**దక్షిణ భారతంలో రూపురేఖలు మారనున్న 5 మార్గాలు**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలోని 17 జిల్లాలను కలుపుతూ 5 ప్రత్యేక లైన్లను విస్తరిస్తున్నారు.
ఘట్‌కేసర్ – కాజీపేట (తెలంగాణ): 110 కి.మీల 4వ లైన్
అరక్కోణం – రేణిగుంట (ఏపీ/తమిళనాడు): 77 కి.మీ పరిధిలో 3, 4వ లైన్లు
వైట్‌ఫీల్డ్ – బంగారపేట (కర్ణాటక): 47 కి.మీ మేర 3, 4వ ట్రాక్‌లు.
హోసూరు – ఓమలూరు (తమిళనాడు): 147 కి.మీ డబ్లింగ్ పనులు.
సేలం – కరూర్ – దిండిగల్ (తమిళనాడు): 159 కి.మీ డబ్లింగ్ ప్రాజెక్ట్.
పర్యావరణానికి వరం.. 52 లక్షల మందికి మేలు
ఈ మెగా ప్రాజెక్టుల ద్వారా గ్రామీణ ప్రాంతాలకు రైలు సదుపాయం పెరగడంతో పాటు రోడ్డుపై సరకు లారీల రద్దీ తగ్గుతుంది. ఫలితంగా 2,121 గ్రామాలకు నేరుగా రైలు మార్గం అనుసంధానమవుతుంది. రోడ్డు మార్గంపై ఒత్తిడి తగ్గి, ఏటా 8 కోట్ల లీటర్ల విలువైన ఇంధనం ఆదా అవుతుంది. వాతావరణంలోకి విడుదలయ్యే 42 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలు నియంత్రణలోకి వస్తాయి. ఇది సుమారు రెండు కోట్ల చెట్లను నాటడంతో సమానమైన పర్యావరణ ప్రయోజనం. రోడ్డు రవాణాతో పోలిస్తే రైల్వేల ద్వారా సరకు రవాణా చౌక కావడంతో వ్యాపార వ్యయం తగ్గి అంతిమంగా వినియోగదారులకే మేలు జరుగుతుందని కేంద్రం వెల్లడించింది.

## 100 డాలర్లు దాటిన ముడి చమురు ధరలు..

**భారత్ ఆర్థిక వ్యవస్థపై పశ్చిమాసియా సంక్షోభం..!**

పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడి చమురు ధరలు బ్యారెల్‌కు వి100 దాటాయి. ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థపై, స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇంధన దిగుమతి భారం పెరిగి, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ఎగుమతుల క్షీణత వంటి సమస్యలతో భారత ఎకానమీ ఒత్తిడికి లోనవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు 100 డాలర్లను దాటింది. దీంతో స్టాక్ మార్కెట్లతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది.




అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ చుక్కలను తాకుతున్నాయి. సౌదీ అరేబియా ఇంధన ఉత్పాదక కేంద్రాలపై హౌతీ మిలిటెంట్లు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయడంతో పశ్చిమాసియాలో టెన్షన్ వాతావరణం మరింత పెరిగింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు రేటు మరోసారి 100 డాలర్లను సమీపించింది. దీంతో మిడిల్ ఈస్ట్‌లో అశాంతి పెరిగితే క్రూడాయిల్ ధరలు మరింత పెరిగే అవకాశాలున్నాయి. దేశ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో రష్యాతోపాటు మిడిల్ ఈస్ట్ దేశాల వాటానే ఎక్కువ. అయితే యుద్ధంతో యూఏఈ, సౌదీ, ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితర గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు ముడి చమురు, గ్యాస్ రాక ఇబ్బందికరంగా మారింది. పెట్రో ఉత్పత్తుల రవాణాకు కీలకమైన హొర్ముజ్ జలసంధిలో నౌకల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నౌకలపై దాడులు జరిగితే బ్యారెల్ విలువ 120 డాలర్లను తాకే అవకాశం ఉంది. అమెరికాకు మద్దతిస్తున్నాయని గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు దేశీయ మార్కెట్‌లో పెట్రో ధరల పెంపునకు దారితీస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ ఒత్తిడికి లోనవుతోంది. చమురు దిగుమతుల చెల్లింపుల భారం, ఇంధన ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం విజృంభణ, రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు, స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు, రూపాయి మారకం విలువ క్షీణత, చమురు ఆధారిత ఉత్పత్తుల తయారీ ఖరీదెక్కడం, ఎగుమతుల పతనం వంటివి దేశ ఎకానమీని రిస్క్‌లో పడేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభం కాగా, అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశంలో లీటర్ పెట్రోల్ రేటు రూ.7.35, డీజిల్ ధర రూ.7.53 పెరిగింది. అమెరికాతో ఇరాన్ చర్చల కారణంగా అప్పట్లో కొంతమేర శాంతియుత పరిస్థితులు మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్నాయి. ఇది మార్కెట్‌లో క్రూడ్ ధరల తగ్గుముఖానికి కలిసొచ్చింది. అయితే మళ్లీ దాడులు మొదలవడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఇక ఈ ఏడాది ఏప్రిల్-జూలైలో భారత ముడి చమురు దిగుమతుల విలువ 56 శాతం పెరిగి 63.4 బిలియన్ డాలర్లకు చేరింది. నిరుడు ఇదే సమయంలో 40.5 బిలియన్ డాలర్లేనని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

## గిరిజనులకు సంక్షేమ ఫలాలు...
# అందేలా చర్యలు

**పామిడి** : గిరిజనులకు కేటాయించిన సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికే అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జి రెడ్డి సూచించారు. బుధవారం పామిడి మండలం పాల్యం తండాలో గిరిజనులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పెద్ద సంఖ్యలో గిరిజన తండాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సరైన అవగాహన లేక పలువురు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని తెలిపారు. అధికారులు తండాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రభుత్వ పథకాల ఫలాలు నేరుగా అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలన్నారు. విద్య, ఉద్యోగాల్లో గిరిజనులకు కేటాయించిన రిజర్వేషన్‌లో ఎలాంటి అన్యాయం జరగకుండా పర్యవేక్షించాలని సూచించారు. చేయని నేరాలకు గిరిజనులపై అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు.





అమాయక గిరిజనులపై అక్రమ కేసులు పెట్టినట్లు ఫిర్యాదులు వస్తే బాధ్యులైన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అనేక ప్రాంతాల్లో స్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ అధికారులు వెంటనే స్థలాలను గుర్తించి కేటాయించాలని ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు మంజూరు చేయడంతో పాటు భూపంపిణీలో అర్హులైన పేదలకు భూములు కేటాయించాలని కోరారు. గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం భర్తీ చేయనున్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల్లో అర్హులైన గిరిజనులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనేక గిరిజన తండాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, ఆయా ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణంతో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. తండాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. గిరిజనులకు భవిష్యత్తులో ఎలాంటి అన్యాయం జరగకుండా ఎస్టీ కమిషన్ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, కె. మల్లేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, ఎస్టీ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

# నిత్యావసర ధరలు తగ్గించాలి

**కదిరి** : నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించి సామాన్యులపై పడుతున్న భారాన్ని తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం కదిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పట్టణ సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వంటనూనె ధరలు భారీగా పెరగడంతో పాటు ఉల్లి, బియ్యం, కందిపప్పు, చక్కెర, టమాటా తదితర నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.కదిరప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి ఇలియాకత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు.



పెట్రోల్, గ్యాస్ ధరలు పెరగడం వల్ల కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నా మార్కెట్‌లో ధరల పెరుగుదలకు అడ్డుకట్ట పడటం లేదని ప్రశ్నించారు. బ్లాక్‌మార్కెట్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరికట్టి అక్రమంగా సరుకులు నిల్వ చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు కొనసాగుతున్న దళారీ వ్యవస్థను నియంత్రించి రైతుకు గిట్టుబాటు ధర, వినియోగదారుడికి సరసమైన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్‌పై పన్నుల భారాన్ని తగ్గించి రవాణా ఖర్చులను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఆదినారాయణ, నాయకులు భాస్కర్, షబ్బీర్, బాబావలి, శివశంకర్, మహిళా సంఘం నాయకులు హరిత, లక్ష్మీ, నరసమ్మ, ఆదిలక్ష్మి, మాధవి, శాంతి, సబియా, రేష్మ, ఆలియా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది.. అన్యాయం ఓడింది

**అనంతపురం** : చంద్రబాబు అరెస్టు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గంలో నిర్వహించిన 'నిజం గెలిచింది' కార్యక్రమంలో భాగంగా అనంతపురంలోని పల్లె రఘునాథ్ రెడ్డి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం దీపాలు వెలిగించారు. స్కిల్ కేసులో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్టు చేసిన ఘటనను వారు గుర్తుచేసుకున్నారు.



ఎలాంటి ప్రాథమిక ఆధారాలు, కనీస నోటీసులు లేకుండా 73 ఏళ్ల సీనియర్ నాయకుడిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఆ సమయంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి నిరసనలు చేపట్టారని, 53 రోజులపాటు దీక్షలు, ఆందోళనలు కొనసాగాయని తెలిపారు. చంద్రబాబు అరెస్టుతో తెలుగు ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆయనకు మద్దతుగా జరిగిన ఆందోళనల్లో మహిళలపైనా కేసులు పెట్టారని ఆరోపించారు. చివరకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో నిజం గెలిచిందని పేర్కొన్నారు. చంద్రబాబును రాజకీయంగా దెబ్బతీయాలన్న ఉద్దేశంతో చేసిన ప్రయత్నాలకు 2024 ఎన్నికల ఫలితాలు సమాధానమయ్యాయని అన్నారు. అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారని, ఇది ప్రజా తీర్పుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు నాయకత్వానికి రాష్ట్ర ప్రజలంతా అండగా ఉన్నారని, ఆయన అందించిన సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని సింధూర రెడ్డి, రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు వైఎస్సార్సీపీ సమరశంఖం!

## బనగానపల్లె విస్తృత సమావేశానికి భారీగా తరలివచ్చిన శ్రేణులు
## సమష్టి కృషితో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలని పిలుపు

**బనగానపల్లె సెప్టెంబర్ 9 పల్లె సాక్షి :**





బనగానపల్లె నియోజకవర్గ వైఎస్సార్సీపీ శ్రేణులు కదం తొక్కాయి. బనగానపల్లె పట్టణంలోని జీఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ వైఎస్సార్సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. ఈ సమావేశానికి నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు భూమా కిషోర్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు కాటసాని ప్రసాద్‌రెడ్డి, గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

**మెజారిటీ స్థానాలే లక్ష్యం...** స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని వైఎస్సార్సీపీ సత్తా చాటాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**కూటమి పాలనపై విమర్శలు...** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీల్లో ఎన్ని సంపూర్ణంగా అమలు చేశారని నాయకులు ప్రశ్నించారు. గ్రామ పంచాయతీల్లో పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేశారంటూ కూటమి నాయకులపై ఆరోపణలు చేశారు. స్థానిక సంస్థల్లో తమకు ఎదురుండదని టీడీపీ నాయకులు కలలు కంటున్నారని, ఆ కలలు కలలుగానే మిగిలిపోతాయని వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో దేవాలయ భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతోందని, దీని ద్వారా కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారంటూ వైఎస్సార్సీపీ నాయకులు ఆరోపించారు. ఈ ఆరోపణలపై సంబంధిత వర్గాలు స్పందించాల్సి ఉంది.

**సాగునీరు, తాగునీటిపై నిలదీత...** శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 870 అడుగుల స్థాయిలో ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని నాయకులు విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో తాగునీటి కోసం సైతం ప్రజలు పోరాటాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్సీపీ చేపట్టిన పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం తాగునీరు విడుదల చేసిందని పేర్కొన్నారు.

**ఫ్యాక్షన్‌కు స్వస్తి.. అభివృద్ధే లక్ష్యం..**
బనగానపల్లె నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధికి బాటలు వేశామని నాయకులు తెలిపారు. కాటసాని కుటుంబానికి భయం అంటే ఏమిటో తెలియదని, ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేసి వైఎస్సార్సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

## చీకటి తెరలు తొలగి...
# నిజం గెలిచిన రోజు

**ఉయ్యాలవాడ, సెప్టెంబర్ 9 :( టుడే పల్లె సాక్షి )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా చీకటి తెరలు కమ్ముకొని నిజం నిప్పుల గెలిచిన రోజు అని టిడిపి మండల కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని అక్రమంగా అరెస్టు చేసిన రోజు అని ఈ చీకటి రోజున నిజం నిప్పులా వెలుగులోకి వచ్చి చీకటి తెరలను చీల్చుకుంటూ ఆంధ్రప్రదేశ్ ప్రజల హృదయాలను గెలుచుకొని ముఖ్యమంత్రిగా అఖండ విజయాన్ని సాధించారన్నారు. అబద్ధాలు, అక్రమ కేసులు, రాజకీయ కక్షలు ఎన్నో ఎదురైనా నిజం కోసం నిలిచిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని చీకటి రోజుల్లోనూ వెన్నంటి నిలిచిన కోట్లాది మంది తెలుగు ప్రజల విశ్వాసం కార్యకర్తల పోరాటం వృథా కాలేదన్నారు. చివరకు నిజమే గెలిచిందనీ న్యాయమే గెలిచిందనీ చంద్రబాబు గారు అఖండ విజయం సాధించారనీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బోరెడ్డి దస్తగిరి రెడ్డి, టిడిపి నాయకులు బోరెడ్డి ఓబుళరెడ్డి, రఘునాథ్ రెడ్డి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై కొరడా..
## నాలుగు టిప్పర్లు సీజ్

**పట్నం** : బిల్లులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లను గనుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టిన తనిఖీల్లో ఈ వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న టిప్పర్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పట్నం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు AP39WU0354, AP39WC3446, AP26TE6449, AP05TG1245గా అధికారులు తెలిపారు.

## బలిజల సమస్యల పరిష్కారానికి
# కృషి చేస్తా
## : మంత్రి సత్యకుమార్

**ధర్మవరం** : బలిజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాపునాడు శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఇటికింటి మహేష్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



శ్రీకృష్ణదేవ రాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, పోతుకుంట రోడ్డులో కాపు భవన్ కోసం గత ప్రభుత్వం కేటాయించిన 69 సెంట్ల స్థలాన్ని పరిరక్షించి భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బలిజలకు తగిన ప్రాతినిధ్యం, అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి జిల్లాలో కాపు భవన్ ఏర్పాటుకు రెండు ఎకరాల స్థలం కేటాయించడంతో పాటు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. బలిజలు ప్రస్తావించిన సమస్యల్లో న్యాయమైన వాటిని పరిశీలించి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చారు. అవసరమైతే సంఘం నాయకులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వద్దకు తీసుకెళ్లి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌ను కాపునాడు నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీరాములు, గందోడి రాజా, ఎర్రగుడి కొండమీద రాయుడు, అచ్యుత లక్ష్మయ్య, చింతల భాస్కర్, తోట కొండమీద రాయుడు, పసుపులేటి వెంకటేష్, గుండ్లపల్లి ధనుంజయ, పాలగిరి గోపి, పాలగిరి వరలక్ష్మి, సుబ్రహ్మణ్యం, పద్మరాజ, శేషయ్య, చిన్నరాయుడు, ఇంద్రా రాయల్, పద్మా మణికంఠ, లోని కోట మల్లికార్జున, పాలగిరి దేవి ప్రియ, గొట్లూరు వెంకటాచలం, ముక్తం మణి తదితరులు పాల్గొన్నారు.

# సాగులో ఉన్న పంటలను రైతులు జాగ్రత్తగా చూసుకోవాలి
## మండల వ్యవసాయ అధికారిని సుచరిత వెల్లడి

**పెద్దకడబూరు సెప్టెంబర్ 9 పల్లె సాక్షి** పెద్దకడబూరు మండల గ్రామ రైతులు ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, అడపాదడపా వర్షాలు మరియు దీర్ఘకాలిక బెట్ట పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున,ప్రస్తుతం సాగులో ఉన్న పంటల దశలను దృష్టిలో ఉంచుకొని రైతులు నేల తేమ సంరక్షణ,రక్షక తడులు,సమతుల్య పోషక యాజమాన్యం మరియు చీడపీడల పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలిని మండల వ్యవసాయ అధికారిని సుచరిత బుధవారం గ్రామ రైతులకు తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులకు తెలియజేస్తూ పత్తి: ప్రస్తుతం పత్తి పంట పూత నుంచి కాయ దశలో ఉంది.బెట్ట పరిస్థితులను తట్టుకునేందుకు 19:19:19 ఏ 5 గ్రా./లీటరు లేదా 2% యూరియా ఏ 20 గ్రా./లీటరు లేదా 13:0:45 ఏ 5 గ్రా./లీటరు నీటికి పిచికారీ చేయాలి.ఆకులు ఎర్రబడినట్లయితే మెగ్నీషియం సల్ఫేట్ ఏ 5 గ్రా./లీటరు పిచికారీ చేయాలి.బెట్ట కారణంగా పూత,కాయ రాలడం కనిపిస్తే ప్లానోఫిక్స్ ఏ 0.2 మి.లీ./లీటరు పిచికారీ చేయాలి. తామరపురుగు, పచ్చదోమ,తెల్లదోమ ఉధృతిని నిరంతరం గమనించాలి. ప్రారంభ దశలో వేపనూనె ఏ 5 మి.లీ./లీటరు లేదా 10,000 జూజూఎ అజాడిరాక్టిన్ ఏ 1 మి.లీ./లీటరు పిచికారీ చేయాలి. పచ్చదోమ ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ఇమిడాక్లోప్రిడ్ ఏ 0.3 మి.లీ./లీటరు లేదా థయామెథాక్సామ్



ఏ 0.3 గ్రా./లీటరు లేదా ఫ్లోనికామిడ్ ఏ 0.3 గ్రా./లీటరు పిచికారీ చేయాలి. పచ్చదోమతో పాటు తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంటే డయాఫెంథియూరాన్ ఏ 1.25 గ్రా./లీటరు లేదా డయాఫెంథియూరాన్ ం ఫ్లోనికామిడ్ ఏ 1.25 గ్రా./లీటరు పిచికారీ చేయాలి. ఫ్యూజేరియం విల్ట్ నివారణకు ట్రైకోడెర్మా ఏ 2 కిలోలు ం సూడోమోనాస్ ఏ 2 కిలోలను 20 కిలోల సేంద్రీయ పదార్థంతో కలిపి ఎకరాకు వినియోగించాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రా./లీటరు నీటికి కలిపి మొక్క మొదలు తడిచేలా వేయాలి. గులాబీ రంగు పురుగు పర్యవేక్షణకు ఎకరానికి 10 ఫెరోమోన్ ట్రాప్‌లు ఏర్పాటు చేసి ఉధృతిని గమనించాలి.అడపాదడపా కురిసిన వర్షాల కారణంగా కాయల్లోకి నీరు చేరి కాయ కుళ్లు తెగులు కనిపిస్తున్న ప్రాంతాల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రా./లీటరు ం ప్లాంటోమైసిన్ ఏ 0.2 గ్రా./లీటరు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ ఏ 3 గ్రా./లీటరు ం కాసుగామైసిన్ ఏ 1.5 గ్రా./లీటరు నీటికి కలిపి కాయలు తడిచే విధంగా పిచికారీ చేయాలి.పత్తిలో వివిధ పోషక లోపాల సవరణ కోసం లేదా మెగ్నీషియం సల్ఫేట్ 1 % వంటి మందులను ఆకులపై పిచికారి చేసి మెగ్నీషియం లోపా సవరణ లోపాన్ని సవరించుకోవలసినదిగా రైతులకు తెలియజేయడం జరిగింది,వర్షం రాక పంట గెడస బారి ఉన్నచోట పంట కీలక దశల్లో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి ఒక ఎకరా కి పిచికారి చేయాలిని గ్రామ రైతులకు తెలిపారు.

APTEL 2022 / 16169
టుడే పల్లె సాక్షి
కర్నూలు
నంద్యాల

# గోవిందపల్లెలో దాహం దాహం...

## అడుగంటిన భూగర్భ జలాలు...కులాయిలకు అందని తాగునీటి సరఫరా

**ఉయ్యాలవాడ, సెప్టెంబర్ 9:( టుడే పల్లె సాక్షి) :** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులలో ఒకవైపు పంట పొలాలు ఎండు దశకు చేరుతున్నాయి, మరోవైపు గ్రామాల్లో మంచినీ టి సమస్యలు మొదలవుతున్నాయి.మండలంలోని గోవిందపల్లె గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా కాకపోవ డంతో కులాయిలకు నీటిని సరఫరా చేయడం లేదు. గ్రామా నికి రెండు కిలోమీటర్ల దూరంలో బోరు ఏర్పాటు చేశారు. బోరులో భూగర్భ జలాల నీటిమట్టాలు పడిపోయాయి. దీం తో ఓవర్ హెడ్ ట్యాంకు గతంలో మూడు గంటలలో పూర్తి అవుతుండగా, ప్రస్తుతం 10 గంటల సమయం పడుతోంది. వచ్చే అరకొర నీరు గ్రామంలోని శివారు ప్రాంతాలలోకి వెళ్తు ఉంది. పైపులైన్ ద్వారా వచ్చే చిన్నపాటి నీటిని గిన్నెలకు పట్టుకొని బిందెలను నింపుకోవాల్సి వస్తుంది. మరోవైపు కొందరు తోపుడుబండ్లపై నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో 10 రోజుల్లో సరైన వర్షాలు పడకపోతే భూగర్భజాలు మరింత అడుగుకు పోయి మీరు అన్ని అవకాశాలు లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.





## షాట్ పుట్ డెస్క్ లో మొదటి స్థానంలో
# నిలిచిన జయశాలి..!

### అంతర్ రాష్ట్ర పోటీలకు ఆమె ఎన్నిక..!

**పెద్దకడబూరు సెప్టెంబర్ 9 (పల్లె సాక్షి ):** మండల కేంద్రమైన పెద్దకడబూరు మండలానికి చెందిన బార్ సబ్బు అనిల్ కూతురు జయశాలి ఇంటర్మీడియట్ ఆర్ట్స్ కాలేజ్ లో చదువుతుంది అయితే ఆమె 36వ అథ్లెటిక్ అసోసియేషన్ మీట్ లో డెస్క్ లో షార్ట్ పుట్ 8.5 మీటర్లు విసిరీ మొదటి స్థానంలో నిలిచారు,ఈ సందర్భంగా ఎంఈఓ 02 రామ్మూర్తి మాట్లాడుతూ జయశాలి అండర్ 18 ఇయర్స్ లో గోల్డ్ మెడల్ సాధించడంతో అభినందనలు తెలియజేశారు,అలాగే అంతర రాష్ట్ర పోటీలకు ఆమె ఎన్నిక అయినట్లు విలేకరులకు తెలియజేశారు,అక్కడ పలువురు విద్యార్థిని ఆమెను అభినందించారు,




# పంటలను కాపాడుకోవాలి

**ఉయ్యాలవాడ, సెప్టెంబర్ 9:( టుడే పల్లె సాక్షి)** వర్ష పరిస్థితులను ఎదుర్కొని పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండ లంలోని సర్వాయిపల్లె, ఆర్.జ ంబులదిన్నె గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. రైతులు సాగుచేసిన మొక్కజొన్న, మినుము, పత్తి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాధార పంటలు వర్షా బావ పరిస్థితుల వల్ల ఎండు దశకు చేరుకున్నాయన్నారు. బెట్టు పరిస్థితుల నుండి పంటలను కాపాడుకునేందుకు 19-19-19, పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటలపై పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.




# శాంతి భద్రతల కోసమే కార్డెన్ అండ్ సెర్చ్

**బెల్లంకొండ సెప్టెంబర్ 9,పల్లె సాక్షి,** గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కార్డెన్స్ అండ్ సెర్చ్ నిర్వహించినట్లు సత్తెనపల్లి డిఎస్పి ఎం.వి.కె.చైతన్య తెలిపారు.జిల్లా అదనపు ఎస్పి రోహిత్ కుమార్ చౌదరి ఆదేశాల మేరకు సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని బెల్లంకొండ మండలం నాగిరెడ్డి పాలెం గ్రామంలో బుధవారం పోలీసులు విస్తృతంగా తని ఖీలు చేపట్టారు. గ్రామం లోని ప్రధాన కూడళ్ళు, అనుమానాస్పద ప్రాంతాలు ఇళ్ల పరిసరాలను పోలీసులు తనిఖీ చేశారు.అనుమానిత వ్యక్తుల కదలికలు,అక్రమ కార్యక్రమాలపై నిఘా పెట్టారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షిం చబోమని డీఎస్పీ స్పష్టం చేశారు.




**ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా..** రానున్న ఎన్ని కలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యల్లో భాగంగానే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా..పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుత వాతావరణం నెలకోల్పేందుకు సహకరించాలని కోరారు.

**డీజే లకు అనుమతి లేదు..** వినాయక చవితి వేడుకల్లో డీజీలకు అనుమతి లేదని డిఎస్పి తెలిపారు.పండుగను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి డీజీలు వినియోగించిన శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**హెల్మెట్ తప్పనిసరి...** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డిఎస్పి సూచించారు.ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడప రాదని తెలిపారు.మద్యం తాగి వాహనం నడిపితే..రూ.10 వేలు జరిమానా విధించటం జరుగుతుందన్నారు.యువత అతివేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులకు శాంతిభద్రతలపై అవగాహన కల్పిస్తూ.. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.కార్డెన్ అండ్ సెర్చ్ లో సరైన పత్రాలు లేని 39 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ సీఐ.కిరణ్,సత్తెనపల్లి టౌన్ సిఐ. నాగ మల్లేశ్వరరావు,అమరావతి సిఐ.అచ్చయ్య,అచ్చంపేట సీఐ. శ్రీనివాసరావు,బెల్లంకొండ ఎస్సై, పి.గోపి సత్తెనపల్లి సబ్ డివిజన్ ఎస్సైలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కోసిగిలో తాగునీటి కోసం
# ప్రజల పడి కాపులు..

### స్పందించని నాయకులు అధికారులు

**కోసిగి ఆగస్టు 09 టుడే ( పల్లె సాక్షి)** కోసిగి మండలం సిద్ధపాలెం (బీరప్ప) గుడి పరిసర ప్రాంతాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. కరవు కాలంలో తాగడానికి చుక్క నీరు లేక స్థానికులు అల్లాడిపోతున్నారు. డబ్బులు కట్టించుకున్నా నీరివ్వ లేదు: తెలిసిన నాయకులను అడిగితే డిపాజిట్లు కట్టించుకుని కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. కానీ, పైపుల్లో నీటిని మాత్రం వదలడం లేదు.నిర్లక్ష్యపు సమాధానాలు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ స్థానిక బాధ్యులకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారు. కొనుగోలు మరియు క్యాలైన్లు డబ్బులు ఉన్నవాళ్లు నీటిని కొనుక్కుంటుండగా లేనివాళ్లు మైళ్ల దూరం నడిచి పక్క బోర్ల వద్ద గంటల తరబడి క్యూ లైన్ నిలబడు తున్నారు. పైపులు పగిలితే ప్రజలే స్వంత ఖర్చులతో బాగు చేసుకుంటున్నారు.ఉన్నతాధికారులు మరియు జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి, సిద్ధపాలెం ప్రజలకు తాగునీటి సరఫరా జరిగేలా న్యాయం చేయాలని స్థానికులు మనస్ఫూర్తిగా వేడుకుంటున్నారు.

## నోటీసులుతో అధికారులు...
# కాలయాపన చేయడం తగదు

### విద్యార్థి పై విచక్షణ రహితంగా దాడి చేసిన ఎచ్ మురవణి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలహిందీ టీచర్ నీ వెంటనే సస్పెండ్ చేయాలి

**పెద్దకడబూరు సెప్టెంబర్ 09 (పల్లెసాక్షి)** విద్యార్థిని విచక్షణ రహితంగా దాడి చేసిన హిందీ టీచర్ ని సస్పెండ్ చేయాలి అని ఆర్ పి ఎస్ ఎఫ్ పిఆర్ఎస్ వై ఎఫ్ విద్యార్థి సంఘాల



ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ అఫ్రిది పి ఆర్ ఎస్ వై ఎఫ్ జిల్లా కన్వీనర్ రఘు నాథ్ మాట్లాడుతు పెద్దకడబూ రు మండలం మురవణి జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో హిందీ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న నాయక్ ఒక విద్యార్థిని విచక్షణ రహితంగా దాడి చేయడం బాధాకరమని బుధవారం వారు ఒక ప్రకటనలో తెలిపారు.విద్యా హక్కు చట్ట ప్రకారం విద్యార్థులను కొట్టే హక్కు టీచర్లకు లేదని విద్య బుద్ధులు నేర్పించాల్సినటువంటి టీచర్లే ఈ విధంగా విద్యార్థులను బాధించడం ఎంతవరకు సమంజసమని వారు అన్నారు. మరియు విద్యార్థుల కోసం వారి భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు నిర్వహిస్తూ ఉంటే ఈయన మాత్రం విద్య హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ విద్యార్థులపై దాడులు చేయడం జరుగుతుంది.అదేవిధంగా ఆ ఒక్క విద్యార్థి పైనే కాకుండా మిగతా కొంతమంది విద్యార్థులు పైన కూడా ఆయన పెట్టిన టార్చర్ తట్టుకోలేక పాఠశాల వదిలిపెట్టడం జరుగుతుందని ఆరోపణలు కూడా ఉన్నాయని ఈవిషయం పై జిల్లా విద్యాధికారులకు విద్యార్థి సంఘాలుగా మేము ఫిర్యాదు చేయగా వారు టీచర్ కి నోటీసులు ఇవ్వడం జరిగింది.జిల్లా విద్యాశాఖ అధికారులు నోటీసులతో కాలయాపన చేయకుండా విద్యార్థిపై దాడి చేసినటువంటి టీచర్ నీ వెంటనే సస్పెండ్ చేయాలనీ వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో మరిన్ని ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు.ఉదయ్ రమేష్,రాజు,బాబు, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడింగ్ యాప్స్ మాయలో పడొద్దు

### అధిక లాభాల ఆశ చూపి మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
### : బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్

**బనగానపల్లె సెప్టెంబర్ 9 పల్లె సాక్షి :** బనగానపల్లె మండలం అధిక లాభాలు వస్తాయంటూ నమ్మబలికి ప్రజలను ట్రేడింగ్ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టించే మోసపూరిత వ్యవహారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ యాదవ్ సూచించారు. బనగానపల్లెలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత కొంతకాలంగా ~ ఇుజు ట్రేడింగ్ యాప్లో పెట్టుబడులు పెట్టి అధిక లాభాలు వస్తాయని నమ్మిన పలువురు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు. ట్రేడింగ్ యాప్‌ను ప్రోత్సహిస్తూ, ప్రజలను పెట్టుబడులు పెట్టేలా ప్రేరేపించిన వ్యక్తులపై సమగ్ర దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం వెనుక ఉండి సహకరించిన వ్యక్తులను కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.మోసానికి గురైన బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా జిల్లా స్థాయి అధికారులతో సమగ్ర విచారణ చేపట్టాలని శివకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. అధిక లాభాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఆర్థిక నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు.ప్రజలు కూడా గుర్తుతెలియని ట్రేడింగ్ యాప్స్, అధిక రాబడుల హామీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థల విశ్వసనీయతను పరిశీలించాలని సూచించారు.




## బాట సుంకలమ్మ అమ్మవారికి...
# మాజీ ఎమ్మెల్యే కాటసాని ప్రత్యేక పూజలు

**బనగానపల్లె సెప్టెంబర్ 9 పల్లె సాక్షి** బనగానపల్లె.నియోజకవర్గం అవుకు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ కార్యకర్త వేటూరి రమణ ఆహ్వానం మేరకు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని



రామిరెడ్డి బాట సుంకలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, అవుకు మాజీ ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి రవీంద్రరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాయునంద గౌడ్, మద్దయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

# మినీ గోకులం షెడ్ నిర్మాణానికి శ్రీకారం

**మహానంది, సెప్టెంబర్ 09, పల్లె సాక్షి:** టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టింది. మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టింది. మండలంలోని గాజులపల్లి గ్రామ వాస్తవ్యులైన పటాన్ మాబున్ని అనే మహిళ పశు పోషణ పై ఆధారపడి జీవిస్తున్న ఆమెకు గోకులం షెడ్ మంజూరు అవడంతో నిర్మాణ పనులను ప్రారంభించిన స్థానిక మహిళా టీడీపీ నాయకురాలు గంగవరపు శశికళా కొండారెడ్డి మరియు పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ డా శివానంద్. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో పశు పోషణ, కోళ్లు, గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ, పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పశువుల నివాసానికి కొద్దిపాటి స్థలం ఉంటే మినీగోకులం పేరిట షెడ్లు నిర్మించేం దుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎదీ+=ూవీ+ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ సోమశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ బాబయ్య స్థానిక టీడీపీ నాయకులు శ్రీనివాస రెడ్డి, పి.మధు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




EDITED&PUBLISHED AND OWNED BY EDITOR:V.LINGAMURTHY. PUBLISHED AT DOOR NO:4/83,BC COLONY, KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, PINCODE:518360.MURTHY OFFSET PRINTERS D.NO:4/83,KAMBALADINNE (V), PEDDAKADUBUR (M), KURNOOL (D), ANDRA PRADESH, CONTACT NO:9000367833.RNI,APTEL/2022/82037 E-MAIL ID:pallesakshi2022@gmail.com